క్లుప్తంగా

విద్యార్థికి ఆర్థిక చేయూత



వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని కొత్త సూగూరు గ్రామానికి చెందిన పురుషోత్తంగౌడ్, పుష్ప కూతురు విజయలక్ష్మి హైదరాబాద్‌లో శ్రీదేవి ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలల్లో బీటెక్ (సీఎస్‌సీ) మూడో సంవత్సరం చదువుతుంది. పేద కుటుంబంలో పుట్టిన ఆమెకు తండ్రి మృతి చెందాడు. తల్లి పుష్ప దినసరి కూలి, వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగాలేక కూతురు ఫీజు కట్టడానికి డబ్బులేవు. విజయలక్ష్మి కళాశాల ఫీజుకోసం వెంటనే స్పందించిన సోషల్ రెస్పాన్సిబిలిటీ టీం సభ్యులు సంజయ్, నాగేష్, మురళి, వేణు, ఉదయ్‌కిరణ్, అశోక్‌వీరు శనివారం గ్రామంలో విద్యార్థి ఇంటిదగ్గర వెళ్లి రూ.45 వేల చెక్కును ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్థిక సహకారం అందించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



కొత్తకోట: పట్టణంలో నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన కీ.శె.మణెమ్మ, రాములు జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు పల్లవి, చందు రూ. 2,51,116 ల విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని విరాళాన్ని అయ్యప్పసేవా సమితి అధ్యక్షుడు ధూపం నాగరాజు, అనిల్‌కుమార్, సత్యంసాగర్, వినయ్ కుమార్, గోవిందు, కిషోర్‌లకు అందజేశారు.

వైభవంగా ఆరాధనోత్సవాలు



అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో దేవేంద్రచార్యుల ఆరాధనోత్సవాలు శనివారం గోమాతపూజతో ప్రారంభమయ్యాయి. జీవ సమాధి అయిన దేవేంద్రచార్యుల మూలవిరాట్‌తో కృష్ణానది జలాలతో అభిషేకించి పూజలను నిర్వహించారు. నేడు చండీయాగంతో పాటు కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు నరసింహాచారి వెల్లడించారు. కార్యక్రమంలో నందికొండ జగద్గురుశ్రీ గాయత్రీ పీఠం పీఠాధిపతి శ్రీకాంతేద్రస్వామి హాజరవుతున్నట్లు తెలిపారు. 13న జరిగే పూజలకు మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొంటున్నట్లు తెలిపారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి



వనపర్తిటౌన్: విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటుపడరాదని సీఐ కృష్ణ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో స్కాలర్స్ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ... 20 ఏళ్ల లోపు విద్యార్థులు భౌతిక ఆకర్షనను అధిగమించి చదువుపై శ్రద్ధపెట్టాలన్నారు. కళాశాలలో తనకు విద్యను బోధించిన డాక్టర్ జగదీశ్వర్, వరప్రసాద్‌లకు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య సభ్యులు డాక్టర్ పి.జగదీశ్వర్, డాక్టర్ జి.వరప్రసాద్‌రావు, బి.నాగేశ్వర్ రెడ్డి, డాక్టర్ సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ ఎ.శ్రీధర్, అధ్యాపకులు నరసింహా శర్మ, పీడీ విజయ్‌కుమార్, కృష్ణారెడ్డి, రవి కుమార్, మల్లారెడ్డి, అనిల్‌కుమార్, కిషోర్, తిరుపతయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీమంత్రి పరామర్శ



వనపర్తి రూరల్: మండలంలోని సవాయిగుడెం గ్రామానికి చెందిన మాజీసర్పంచ్ నాగిరెడ్డి గత వారంరోజుల క్రితం మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన ఈరన్న అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానిక బీఆర్ఎస్ నాయకులతో విషయం తెలుసుకున్న మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శనివారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి గ్రామంలో వారి కుంటుంబాలను పరామర్శించారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు డేగా మహేశ్వర్‌రెడ్డి, చిట్యాల రాము, శ్రీను, తులసి, రామకృష్ణ, అంజి, మోహన్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంతి భవనం.. నిరుపయోగం



నిరుపయోగంగా ఉన్న గోపల్‌దిన్నె రిజర్వాయర్ విశ్రాంతి భవనం

- మందుబాబు, జూదరులకు అడ్డా
- కనీస వసతులు లేక ఉద్యోగుల ఇబ్బందులు
- వసతుల కల్పనకు విన్నవించి వేసారిన అన్నదాతలు



ధ్వంసమైన శిలాఫలకం

వీపనగండ్ల: రైతుల ప్రయోజనాలు కోసం రూ.లక్షలతో ఖర్చు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం అధికారులు గోపల్‌దిన్నె రిజర్వాయర్ వద్ద నిరుపయోగంగా ఉన్న విశ్రాంతి భవనాన్ని, రోడ్డు మరమ్మతులు బాగు చేయించడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. సరైనా వసతులు కల్పిస్తే ఉద్యోగులు కాల్వల వెంట తిరిగే లస్కర్‌లు రైతులకు ప్రయోజనం జరుగుతుందని పరిసర గ్రామాల రైతులు ఉన్నతాధికారులకు ఎన్నోమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించాలని పలు గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

రూ. లక్షలు ఖర్చు చేసి..

గోపల్‌దిన్నె రిజర్వాయర్‌ను నిర్మించిన తర్వాత నీటి నిర్వహణ అధికారులు లస్కర్‌లకు ఉపయోగకంగా ఉండాలన్న సదుద్దేశంతో రిజర్వాయర్ వద్ద దాదాపు రూ.25లక్షలతో విశ్రాంతి భవనాన్ని నిర్మించారు. భవన నిర్వహణ విషయంలో అధికారులు పట్టించుకోకపోవడంతో పలువురు గుర్తుతెలియని వ్యక్తులు భవనానికి అమర్చిన తలుపులు, కిటికీలను ఎత్తుకెళ్లిపోయారు. తీరా భవనంలో రూమ్‌లు మందుబాబులకు, జూదరులకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. భవనానికి అమర్చిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం అటు వైపుగా వస్తున్న మహిళా రైతులను ఇబ్బందులకు గురి చేయడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

పాడైన రోడ్లతో ఇబ్బందులు..

రిజర్వాయర్‌కు అనుబంధంగా మూడు మండలాల్లోని దాదాపు 40 గ్రామాల ప్రజలకు సాగునీరు అందించేందుకు ఫిల్టర్ బెడ్స్‌ను నిర్మించారు. ఉద్యోగులు, ఫిల్టర్‌బెడ్‌ల వద్దకు వెళ్లేందుకు సరైన రోడ్డు వసతి లేదు. ప్రస్తుతం ఉన్న రోడ్డు గుంతలమయంగా మారి కంపతారచెట్లతో కప్పివేశారు. దీంతో ద్విచక్ర వాహనదారులు సైతం వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో రిజర్వాయర్ కట్టకు రక్షణగా పోసిన మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించకుంటే రిజర్వాయర్‌కు సైతం ప్రమాదం పొంచి ఉందని పలు గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

ప్రత్యేక నిధులు కేటాయించాలి



విశ్రాంతి భవనం వినియోగంలోకి రావాలంటే ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఉద్యోగులకు, లస్కర్‌లకు విశ్రాంతి తీసుకునేందుకు అవసరమైన వసతులను కల్పించాలి.
– సుదర్శన్, ఉపసర్పంచ్ గోపల్‌దిన్నె

డబుల్ రోడ్డు నిర్మించాలి



మండలకేంద్రం నుంచి గోపల్‌దిన్నె రిజర్వాయర్ ఫిల్టర్ బెడ్స్‌కు చేరుకునేందుకు డబుల్ బీటీ రోడ్డును నిర్మించాలి. వేసవికాలంలో వేలాది మంది ప్రజలకు సాగునీరు అందించే రిజర్వాయర్ రక్షణకట్ట మట్టిని తరలించే వారిపై చర్యలు తీసుకోవాలి. – ఎత్తం బాలస్వామి, మాజీ రైతుకమిటీ అధ్యక్షుడు వీపనగండ్ల

ఉన్నతాధికారులకు విన్నవించాం

విశ్రాంతి భవన పునర్ నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు విన్నవించాం. మట్టిని తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు పలుమార్లు సమాచారాన్ని ఇచ్చాం. రైతులు, గ్రామస్తులు సహకరించి రిజర్వాయర్‌కు సంబంధించిన ఆస్తులకు నష్టం వాటిల్లకుండా చూడాలి.
– సతీష్, ఏఈ, జూరాల సబ్‌డివిజన్ పెబ్బేరు



తరలించుకుపోగా మిగిలిన రక్షణ కట్టమట్టి

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం



వనపర్తిలో మిఠాయిలు పంపిణీ చేస్తున్న కళావతమ్మ

వనపర్తి రూరల్: బాలికలతోనే ప్రపంచ భవిష్యత్ ముడిపడి ఉందని ఎస్ఎఫ్ఐ డబ్ల్యూ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు కళావతమ్మ అన్నారు. శనివారం జిల్లాకేంద్రం సీపీఐ కార్యాలయంలో ఎస్ఎఫ్‌డబ్ల్యూ మహిళాసమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నేతలు బాలికలకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలను పుట్టనిద్దాం, చదవనిద్దాం, ఎదగనిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ జయమ్మ, జ్యోతి, సుప్రియ, రూప, సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్, శివ, రమణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణకు సహకరించాలి

వీపనగండ్ల: బాలికల సంరక్షించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారాన్ని అందించినప్పుడే సమాజంలో వారు గౌరవప్రదంగా జీవనాన్ని సాధించగలుగుతారని అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు సుగుణబాయ్, మహేశ్వరి, సువర్ణ, ఎల్లమ్మ, హెల్పర్లు నిరంజనమ్మ పాల్గొన్నారు.

టీషర్టులు పంపిణీ



వనపర్తిటౌన్: ఆర్మీ అగ్నివీర్ రన్నింగ్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి అయ్యపురెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ పెద్దమందడి ద్వారా టీషర్ట్స్, షార్ట్స్ శనివారం పట్టణంలో బాలుర కళాశాల ఎదురుగా పంపిణీ చే శారు. అనంతరం శిక్షణఇస్తున్న గబ్బర్‌సింగ్‌ను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, పీడీ మన్యం , కానిస్టేబుల్ రాఘవేంద్ర, మధు పాల్గొన్నారు.

అప్పుకట్టి ఓట్లు అడగండి



వనపర్తి విద్యావిభాగం: పట్టణంలో 31వ వార్డులో బీఆర్ఎస్ నాయకుడు షేక్ జహంగీర్ ఆధ్వర్యంలో 'కాంగ్రెస్ బాకీ కార్డు ప్రచారం' నిర్వహించారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని పిలుపునిచ్చారు.

ఆర్ఎస్ఎస్ పద సంచలన్



వనపర్తిలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

వనపర్తిటౌన్: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది వేడుకల సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో సంచలన్ రూట్ మార్చ్‌ను నిర్వహించారు. వనపర్తి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో మొదలైన రూట్‌మార్చ్ రెండు బృందాలుగా విడిపోయి ఒకటి గాంధీచౌక్, మరొకటి పీర్ల గుట్ట మీదుగా వనపర్తి పురవీధుల గూండా ఒక్కొక్క బృందం మూడున్నర కిలోమీటర్లు రూట్‌మార్చ్ చేపట్టారు. స్వయంసేవక్ సంఘ్ కవాతు వనపర్తిలో ఆకట్టుకోవడంతో రహదారుల వెంట రూట్‌మార్చ్‌ను చూసేందుకు ప్రజలు తరలివచ్చారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా దేశవ్యాప్తంగా కవాతును నిర్వహించడంతో పాటుగా మానవ సమాజం ఆచరించాల్సిన ఐదు పరివర్తన మార్గాలను ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు ఎల్ల భాస్కర్, కురుమూర్తి, తిరుపాజి, అమరేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ ఎస్ కార్యకర్తలు, ఇతర ప్రతినిధులు తదితర సేవక్‌లు పాల్గొన్నారు.

అధ్వాన రహదారితో అవస్థలు



కొత్తపెట్రోల్ బంక్ సమీపంలో గుంతలమయమైన బీటీ రహదారి

అమరచింత: పట్టణంలోని ప్రధాన రహదారి గుంతలమయంగా మారినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో బీటీ రహదారి అధ్వానంగా మారింది. మరికల్–ఆత్మకూర్ ప్రధాన బీటీ రహదారి కొత్తపెట్రోల్ నుంచి భగత్‌సింగ్ విగ్రహం వరకు పూర్తిగా దెబ్బతిన్న ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపట్టక ముందే రోడ్డు మధ్యలో డివైడర్‌ను నిర్మించడంతో రహదారి పూర్తిగా ఇరుకుగా తయారైంది. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇరుకైన రహదారిలో భారీ గుంతలు వుండటంతో ద్విచక్ర వాహనదారులు రాత్రివేళల్లో గుంతలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి మరమ్మతు పనులు చేపట్టాలని పట్టణ ప్రజలతో పాటు ప్రయాణికులు కోరుతున్నారు.

అన్నను కాపాడబోయి తమ్ముడు..

- చెక్‌డ్యాంలో మునిగి ఇద్దరు సోదరుల మృతి
- చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగిరాని లోకాలకు..
- తల్లి ఏడాది దినకర్మ చేయడానికి వచ్చి మృత్యువాత
- వనపర్తి జిల్లా బలీదుపల్లిలో విషాదం



మంద సుధాకర్ (ఫైల్)



మంద సాయి (ఫైల్)

అడ్డాకుల: తల్లి చనిపోయి ఏడాది కావడంతో దినకర్మ చేయదానికి ఇద్దరు అన్నదమ్ములు పట్నం నుంచి ఊరికి వచ్చారు.. కార్యం పూర్తిచేసిన మరుసటి రోజు సరదాగా చేపలు పట్టేందుకు చెక్‌డ్యాం వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో నీటి సుడిలో మునిగిపోతున్న అన్నను కాపాడబోయి తమ్ముడు కూడా మృతిచెందిన విషాదకర సంఘటన వనపర్తి జిల్లా బలీదుపల్లిలో శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. బలీదుపల్లి గ్రామానికి చెందిన మంద యాదయ్య, మణెమ్మ దంపతులకు నలుగురు కుమారులు ఉన్నారు. అందరూ హైదరాబాద్‌లో ఉంటూ ఆటోలు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. అయితే గతేడాది మణెమ్మ చనిపోవడంతో ఏడాది దినకర్మ చేయడానికి నలుగురు కుమారులు కుటుంబాలతో కలిసి రెండు రోజుల కిందట బలీదుపల్లికి వచ్చారు. శుక్రవారం మణెమ్మ ఏడాది దినకర్మ పూర్తి చేశారు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో పెద్ద కుమారుడు మంద సుధాకర్ (32), చిన్న కుమారుడు మంద సాయి(25) మరో తమ్ముడు మంద కుమార్‌తో పాటు కుటుంబ సభ్యులందరూ కలిసి రెండు ఆటోల్లో గ్రామానికి సమీపంలో ఉన్న పెద్దవాగు చెక్‌డ్యాం వద్దకు వెళ్లారు. దుస్తులు శుభ్రం చేసుకుని కొద్దిసేపు సరదాగా గడిపొద్దామని అక్కడికి చేరుకున్నారు. అయితే చెక్‌డ్యాం దిగువన చేపలు కనిపించడంతో వెంటనే సుధాకర్ చేపలు పడతానంటూ నీళ్లలోకి దిగాడు. చెక్‌డ్యాం దిగువన నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో నీటి సుడి వద్దకు వెళ్లిన సుధాకర్ అందులో చిక్కుకుని మునిపోతూ కనిపించాడు. వెంటనే గుర్తించిన తమ్ముడు మంద సాయి నీళ్లలోకి దిగి అన్నను కాపాడే ప్రయత్నం చేయగా.. ఇద్దరూ నీటి సుడిలో చిక్కుకున్నాడు. ఇద్దరు అందులో కొట్టుమిట్టాడుతుండగా.. కొద్దిదూరంలో ఉన్న మరో తమ్ముడు మంద కుమార్ నీటిలోకి దిగి ఇద్దరిని కాపాడే ప్రయత్నం చేశాడు. ప్రాణాలకు తెగించి కుటుంబసభ్యుల సాయంతో ఇద్దరిని ఒడ్డుకు చేర్చగా.. పెద్ద కుమారుడు మంద సుధాకర్ అప్పటికే మృతిచెందాడు. కొన ఊపిరితో ఉన్న చిన్న కుమారుడు సాయిని అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించేలోగా మృతిచెందాడు. సుధాకర్‌కు భార్య మమత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సాయికి ఇంకా పెళ్లి కాలేదు. కాగా ఇద్దరు సోదరులు ఒకేరోజు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు గ్రామస్తుల చేత కంటతడి పెట్టించాయి. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాలను జనరల్ ఆస్పత్రి మార్చురీలో ఉంచారు. ఆదివారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగిస్తామని తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది. తల్లి దినకర్మకు వచ్చిన కుమారులను మృత్యువు కబలించడంతో బంధువులు తీరని శోకసంద్రంలో మునిగిపోయారు.

రహదారి మరమ్మతు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రూ.10 లక్షలు మంజూరు చేసిన మంత్రి వాకిటి శ్రీహరి

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూర్: మండలంలోని మూలమళ్ల గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితిపై 'సాక్షి' దినపత్రికలో 'రహదారి అధ్వానం' కథనం ప్రచురించారు. దీంతో మంత్రి వాకిటి శ్రీహరి స్పందించి ఆత్మకూర్ పెట్రోల్‌బంకు నుంచి మూలమళ్ల వరకు 11 కిలోమీటర్లు రోడ్డు తాత్కాలిక మరమ్మతులకు రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు శనివారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పూజలు చేసి మరమ్మతు పనులు ప్రారంభించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్ల క్రితం పుష్కరాల సందర్భంగా గ్రామం మీదుగా జూరాల ప్రాజెక్టు వరకు మంజూరైన రోడ్డును గత పాలకులు వేయలేకపోయారన్నారు. ప్రతినిత్యం ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు మంత్రి వాకిటి శ్రీహరితో వివరించారు. దీంతో తక్షణమే మరమ్మతులకు రూ.10 లక్షలు నిధులు మంజూరు చేశారని వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ప్రయాణికులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, ఖాజపాషా, సహదేవుడు, సత్యన్న, రామన్నగౌడ్, నరేష్, రాములు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై సీపీఎం ఇంటింటి సర్వే



కాలనీలో సమస్యలపై ఆరా తీస్తున్న సీపీఎం నాయకులు

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల గ్రామంలోని 7, 8వ వార్డుల్లో ప్రజలు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఆయా కాలనీల్లో తాగు నీటి సమస్య, వీధిలైట్లు వెలగకపోవడం, డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడం, చెత్తబండి కాలనీలకు రాకపోవడం, సీసీరోడ్లు లేక కాలనీ రోడ్లు బురదమయంగా మారింది. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ ప్రత్యేక చొరవ తీసుకొని ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని లేనిచో పార్టీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో గుంటి వెంకటయ్య, భగత్, ఎం.వెంకటయ్య, భాస్కర్, కె.వెంకటయ్య, నిరంజన్, కుమార్, వెంకటేష్, రాములు, రాజు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన



రేమద్దులలో నిరసనలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

పాన్‌గల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై కోర్టులో జరిగిన దాడి ఖండిస్తూ ప్రజా సంఘాలు, సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రేమద్దుల గ్రామంలో శనివారం బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. న్యాయమూర్తిపై దాడికి ప్రయత్నించడం రాజ్యాంగంపై దాడి చేసినట్లేనని వారు పేర్కొన్నారు. దాడికి చేసిన లాయర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు భగత్, వెంకటయ్య, రైతు సంఘం నాయకులు భాస్కర్, వెంకటయ్య, నిరంజన్, డీవైఎఫ్ఐ నాయకులు కమలాకర్, కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డంతా గుంతలమయం..



ఏదుల-రేవల్లి రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత



భారీ వాహనాల రాకపోకలతో బురదమయమైన రోడ్డు

గోపాల్‌పేట: ఏదుల మండల కేంద్రం నుంచి రేవల్లి వెళ్లే దారి గుంతలమయంగా మారింది. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటేనే ప్రజలు, వాహనదారులు జంకుతున్నారు. ఏదుల ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమై సుమారు ఎనిమిదేండ్లు కావస్తోంది. ఏదుల గ్రామం నుంచి రేవల్లి వెళ్లాలంటే ప్రాజెక్టు మధ్యలో నుంచి వెళ్లాలి. ఏదుల శివారు వరకు బీటీ రోడ్డు ఉన్నా ఏదుల ప్రాజెక్టు ఉన్న దగ్గర బీటీ రోడ్డు ఏర్పాటు చేయలేదు. దీంతో మట్టిరోడ్డుపైనే వాహనాలు వెళ్తున్నాయి. వర్షాకాలంలో కురిసిన వర్షాలు, భారీ వాహనాలు తిరిగేరోడ్డు కావడంతో రోడ్డుపై అంతా భారీ గుంతలు ఏర్పడ్డాయి. వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు రోడ్డు బురద, నీటితో నిండిపోయింది. దీంతో కార్లు బురదలో ఇరుక్కుపోయి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలు ఎన్నోసార్లు గుంతల్లో పడిపోయి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి మట్టిరోడ్డును బాగు చేయిండంతో పాటు బీటీరోడ్డు ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో భగవద్గీత కంఠస్థ పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని ఐదు కేంద్రాల్లో భగవద్గీత కంఠస్థ, భావ విశ్లేషణ పోటీలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ జిల్లా కార్యక్రమ నిర్వాహకులు రామాచారి తెలిపారు. శనివారం జిల్లాకేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మూడు విభాగాల్లో భగవద్గీత కంఠస్థ పోటీలు ఉంటాయన్నారు. మొదటి గ్రూప్‌లో 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు 14వ అధ్యాయం గణత్రయ విభాగ యోగం, రెండో గ్రూప్‌లో పదో తరగతి నుంచి ఇంటర్ వరకు 16వ అధ్యాయం దైవాసుర సంపద్విభాగ యోగం, మూడో గ్రూప్‌లో 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వారికి నిత్య జీవితంలో భగవద్గీత భావ విశ్లేషణపై పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 8, 9 తరగతులకు, 18 ఏళ్లలోపు 18 ఏళ్లు పైబడిన వారికి సంపూర్ణ భగవద్గీత 700 శ్లోకాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. నవంబర్ 11న నారాయణపేటలోని గీతా భారతి స్కూల్, 18న గద్వాలలోని శ్రీసరస్వతి టాలెంట్ స్కూల్, 23న వనపర్తి జిల్లా తాటిపాములలోని శ్రీరీతాంబర విద్యాలయం, 25న మహబూబ్‌నగర్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో, 27న నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో కంఠస్థ, భావ విశ్లేషణ పోటీలు ఉంటాయని చెప్పారు. ఈ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు.